నమస్తే తెలంగాణ
# నల్లగొండ
I | నల్లగొండ, శనివారం 26 ఏప్రిల్ 2025 | NALGONDA

## వైద్యారోగ్య శాఖలో అవినీతిపై విచారణ షురూ

- ప్రత్యేకాధికారి నియామకం

సూర్యాపేట, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన కథనాలకు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కార్యాలయం స్పందించింది. విచారణకు అదనపు డైరెక్టర్ డాక్టర్ ఆర్.పుష్పను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా ఆరోపణలకు సంబంధించిన వివరణలతో హాజరు కావాలని జిల్లా వైద్యాధికారి కోటాచలంతో పాటు కార్యాలయం సూపరింటెండెంట్, ఏఓలకు విచారణ అధికారి డాక్టర్ పుష్ప ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సస్పెండ్ అయిన ఓ ఉద్యోగికి నిబంధనల మేరకు నెల నెలా సగం వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఇబ్బందులకు గురి చేస్తూ లక్ష రూపాయల మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు వీడియోలో చెప్పారు. ప్రసూతి సెలవులు తీసుకునే వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులను టార్గెట్ చేసుకుని వారి వేతనాలు దండుకున్నారనే ఆరోపణలపైనా వివరణ కోరారు. విచారణకు లీవ్ ఆర్డర్ల మంజూరు నోట్ ఫైల్, డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్ల ఫైల్, మెటర్నిటీ లీవ్ పొంది జీతం తీసుకున్న వివరాలతోపాటు మరి కొన్ని ఆరోపణలకు సంబంధించి వివరాలతో హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఎల్కతుర్తికి వెళ్దాం ఇలా..



హైదరాబాద్-వరంగల్ హైవే మీదుగా ఒక రూట్

నకిరేకల్ లేదా సూర్యాపేట వయా అర్వపల్లి, తిర్మలగిరి మొండ్రాయి మీదుగా మరో రూట్

కరుణాపురం దాటాక వరంగల్ బైపాస్ రోడ్డు మీదుగా అనంతసాగర్ పార్కింగ్ ఏరియాకు..

జోన్-2లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు

లక్ష మందికిపైగా తరలివెళ్లనున్న జనం.. రేపే వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. వరంగల్ బైపాస్ రోడ్డులోని ఎల్కతుర్తిలో ఆదివారం సాయంత్రం జరిగే సభకు లక్షలాది మంది తరలివస్తారన్న అంచనాతో బ్రహ్మాండంగా కనీవిని ఎరుగని రీతిలో సభకు ఏర్పాట్లు పూర్తికావస్తుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కనీసం లక్ష మందికిపైగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలంతా రంగంలోకి దిగి క్షేత్రస్థాయి వరకు పార్టీ శ్రేణులు, సామాన్య ప్రజలను సమాయత్తం చేశారు. దాంతో వేలాది మంది తరలి వచ్చేందుకు సిద్ధమవుతుండగా ఇప్పటికే అందుకు అవసరమైన రవాణా, ఇతర ఏర్పాట్లను దాదాపు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం నుంచే సభకు తరలివెళ్లేలా జాగ్రత్తలు తీసుకుంటూ రజతోత్సవ బహిరంగ సభ వేదికగా పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ఆలకించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తరలివెళ్లే వాహనాల కోసం సభా నిర్వాహకులు పార్కింగ్ జోన్-2లో స్థలాన్ని కేటాయించారు. ఇక్కడి నుంచే వాహనాలన్నీ అక్కడే పార్క్ చేసుకుని సభాస్థలికి బీఆర్ఎస్ శ్రేణులు,ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది.

– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్25(నమస్తే తెలంగాణ)



ఎల్కతుర్తిలో ముస్తాబవుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణం

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణానికి రాష్ట్రం నలువైపుల నుంచి సులువుగా చేరుకునేందుకు జోన్లవారీగా రూట్ మ్యాప్‌లను సభా నిర్వాహకులు విడుదల చేశారు. సభకు తరలివచ్చే లక్షలాది మంది జనం, వేలాది వాహనాలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఐదు జోన్లను సిద్ధం చేశారు. అందులో పార్కింగ్ జోన్-2ను ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వచ్చే వాహనాల కోసం కేటాయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలోని ఇల్లందు, పాలేరు, సత్తుపల్లి, మధిర, పినపాక, వైరా, ఇల్లెందులో కొన్ని మండలాల వాహనాలను పార్కింగ్ జోన్-2 కోసం అనంతసాగర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో ఆపాల్సి ఉంటుంది. ఇక ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆలేరు, భువనగిరి, మునుగోడు నియోజకవర్గాలతోపాటు నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల, రామన్నపేట మండలాలకు చెందిన వాహనాలు వరంగల్-హైదరాబాద్ హైవే మీదుగా భువనగిరి, ఆలేరు, జనగాం, స్టేషన్‌ఘన్‌పూర్ మీదుగా కరుణాపురం దాటాక వరంగల్ బైపాస్ మీదుగా దేవన్నపేట టోల్ గేట్ దాటి మడిపల్లి నుంచి అనంతసాగర్ పార్కింగ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన వాహనాలు నకిరేకల్ మీదుగా అర్వపల్లి, తిరుమలగిరి, మొండ్రాయి, పాలకుర్తి మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకుని అక్కడి నుంచి కరుణాపురం దాటాక వరంగల్ బైపాస్ మీదుగా దేవన్నపేట టోల్‌గేట్‌కు చేరుకుని మడిపల్లి మీదుగా అనంతసాగర్ పార్కింగ్ స్థలానికి వెళ్లాల్సి ఉంటుంది. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నుంచి వెళ్లేవారు సూర్యాపేట, అర్వపల్లి, తిరుమలగిరి, మొండ్రాయి, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ చేరుకుని అక్కడి నుంచి కరుణాపురం దాటాక బైపాస్ రోడ్డు మీదుగా దేవన్నపేట టోల్‌గేట్‌కు చేరకుని మడిపల్లి మీదుగా అనంతసాగర్ పార్కింగ్ స్థలానికి చేరుకోవాలి. ఈ రూట్‌లోని వాహనాలు అర్వపల్లి, తిరుమలగిరి మీదుగా జనగాం, స్టేషన్ ఘనపూర్ రూట్‌లోనే వరంగల్-హైదరాబాద్ హైవే మీదుగా కూడా అందరికీ కామన్ పాయింట్‌గా ఉన్న కరుణాపురం దాటాక బైపాస్ రోడ్డు మీదుగా చేరుకోవచ్చు. వరంగల్-హైదరాబాద్ హైవే హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మహబూబ్‌నగర్ వాహనాలతో రద్దీ కానున్న నేపథ్యంలో మొండ్రాయి, పాలకుర్తి మీదుగా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద హైవే ఎక్కి కరుణాపురం దాటాక వరంగల్ బైపాస్ మీదుగా సభాస్థలికి చేరుకుంటే ఇబ్బంది ఉండదనేది అంచనా. ఇలా ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా సభకు తరలివెళ్లే వాహనాదారులకు సభా నిర్వాహకులు ముందుస్తుగానే స్పష్టమైన సూచనలు చేశారు. అందుకు అనుగుణంగా సభకు తరలివెళ్లే వాళ్లు ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది లేకుండా సభాస్థలికి చేరుకోవడంతోపాటు తిరిగి సొంత ఊర్లకు రావడం సులువు కానుంది.

ఇంటర్వ్యూ Interview



# రజతోత్సవ సభకు సకల జనులు

### సభకు వస్తామని ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు

వాహనాలు పెడితే చాలని కోరుతున్నారు

కేసీఆర్‌ను చూడాలి... చెప్పే మాటలు వినాలని ఎదురుచూస్తున్నారు

ఉమ్మడి జిల్లా నుంచి కనీవిని ఎరుగని రీతిలో సిద్ధమవుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

ఎవరెన్ని కుట్రలు చేసినా సభ సక్సెస్ ఆగదు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : 'అన్ని రంగాల్లో విఫలమైన రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ రజతోత్సవ సభను అడ్డుకునేందుకు కుట్రలకు తెరలేపింది. వాహనదారులను బెదిరిస్తున్నది. కానీ, మేం కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయాం.. తండ్రి లాంటి కేసీఆర్‌ను దూరం చేసుకు న్నాం.. ఆ ఫలితం నేడు అనుభవిస్తున్నాం అంటూ కలత చెందుతున్న సాధారణ ప్రజలు, రైతులు అన్ని వర్గాల వారు వరంగల్ సభకు వచ్చి మీరే మా నాయకుడు.. మళ్లీ మీరే మాకు దారి చూపించాలి.. ఈ కాంగ్రెస్ పీడ నుంచి విముక్తులను చేయాలంటూ లక్షలాదిగా చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.. చిత్ర హింసలకు గురి చేసినా సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామంటూ జనం బయటకు వస్తున్నారు.. డబ్బులు ఉన్న వాళ్లు స్వచ్ఛందంగా వస్తుంటే, లేనివారు తమకు వాహనాలు ఏర్పాటు చేయండి.. ఇంకేం వద్దు అంటూ లేఖలు రాస్తున్నారు' మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రేపటి వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో నమస్తే తెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

### నాటి సకల జనుల సమ్మెలా స్పందన

'ఉమ్మడి పాలకులతో దశాబ్దాల తరబడి నష్టపోవడంతో కేసీఆర్ ప్రారంభించిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సకల జనుల సమ్మె ప్రధాన ఘట్టం. నాడు ప్రతి ఇంటి నుంచి ప్రజలు బయటకు వచ్చారు. నేడు మోసపూరిత మాటలు.. చిల్లర హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారుతో యాష్ట పడుతున్న జనం మళ్లీ కేసీఆరే కావాలి.. కేసీఆరే రావాలి అంటున్నారు. ఎన్నికలు తొందరగా వస్తే బాగుండని ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంతో నాటి సకల జనుల సమ్మెకు వచ్చినట్లు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వరంగల్‌లో తలపెట్టిన సభకు వస్తున్న స్పందన ఊహకందని విధంగా ఉంది.

### వారం ముందు నుంచే సభ సక్సెస్‌ను చూస్తున్నాం

రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లపాటు అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిపిన పార్టీ రజతోత్సవ సభ భారీగానే ఉంటుందని మేమే కాదు అధికార పార్టీ సైతం అంచనా వేస్తుంది. సభకు వారం ముందు నుంచే మేము సభ సక్సెస్‌ను చూస్తున్నాం. సభ విజయవంతం కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు జరిగాయి. ప్రజలే మమ్మల్ని సభకు తీసుకెళ్లండంటూ అడుగుతున్నారు. వారం ముందే సూర్యాపేట నుంచి ఎడ్ల బండ్ల యాత్ర ప్రారంభమైంది. నేడు సూర్యాపేటతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి సైకిల్ యాత్రలు, పాద యాత్రలు మొదలయ్యాయి. మరోపక్క అనేక గ్రామాల నుంచి తాము అంత దూరం రావడానికి సిద్ధం.. మాకు తినేందుకో, తాగేందుకో ఏమీ వద్దు.. బస్సులు మాత్రం సమకూర్చాలి అంటూ లేఖలు రాస్తున్నారు. ఇటీవల తిప్పర్తి మండలం నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌కే లేఖ రాశారు.

### కుట్రలతో సభను ఆపే దమ్ముందా..?

చోటే బాయ్.. బడే బాయ్‌లే కాదు.. వారి జేజమ్మలు దిగి వచ్చి కుట్రలు చేసినా... సభ ప్రాంగణం వద్ద లేని కాల్వలు పూడుస్తున్నారన్నా... అప్పటికే ఎండిపోయిన పంటలు పాడవుతున్నాయన్నా... ఎలాంటి కుట్రలకు పాల్పడినా ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా వరంగల్ సభను ఆపే దమ్ము ఎవ్వరికీ లేదు. ఇప్పటికే జనం తండోప తండాలుగా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలోని పల్లె పల్లె నుంచి సభకు వెళ్లేందుకు స్వచ్ఛందంగా సిద్ధమవుతున్నారు. అధికార పక్షం అడ్డుకునే ప్రయత్నం చేసి ప్రజాగ్రహానికి గురికావద్దు.. అలాగే మరింత అభాసుపాలు కావద్దు.

### నిబంధనలు పాటించాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వరంగల్ సభకు తరలివెళ్లే బీఆర్ఎస్ శ్రేణులు, జనం అన్ని నిబంధనలు పాటించాలి. సభా ప్రాంగణం వద్ద ఆయా జిల్లాల నుంచి వచ్చే వారికి కేటాయించే పార్కింగ్ ప్రదేశాలకు వెళ్లి అక్కడి నుంచి సభకు వెళ్లాలి. ఇన్‌చార్జీలు సమన్వయంతో పని చేస్తూ సభకు ఎలా తీసుకువెళుతున్నారో అదే మాదిరి వాహనాల్లో ఇంటికి చేర్చే వరకు అప్రమత్తంగా ఉండాలి. సభను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసులతో కుట్రలు చేయిస్తున్నది. అవేమీ పట్టించుకోకుండా ప్రతి ఒక్కరూ సభ వరకు చేరుకుని కేసీఆర్ ప్రసంగం వినాలి'అని జగదీశ్‌రెడ్డి కోరారు.




హుజూర్‌నగర్‌లో బహిరంగ సభ వాల్ రైటింగ్ చేస్తున్న బడుగుల లింగయ్యయాదవ్

## కేసీఆర్ సభతో అధికార పార్టీ గుండెల్లో రైళ్లు

- బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25 : ఈ నెల 27న వరంగల్‌లో కేసీఆర్ నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభతో అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ హుజూర్‌నగర్ పట్టణంలో శుక్రవారం ఆయన వాల్ రైటింగ్ రాశారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే దిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అరాచక పాలనతో విసిగిపోయిన జనం కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మాయ మాటలు, అలివిగాని హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వరంగల్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ గౌడ్, బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు దొడ్డ నరసింహారావు, రామిశెట్టి రాము, పారేపల్లి నరసింహారావు, జడ అంజి యాదవ్, కారింగుల చుక్కయ్య, అమరబోయిన నాగరాజు, కొరివి వీరయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



పానగల్ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## ఉత్సాహంగా బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల పిలుపు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 25 : ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంత చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పానగల్ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ర్యాలీని కంచర్ల జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ బహిరంగ సభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ జాఫర్, యుగంధర్‌రెడ్డి, జయప్రద, మామిడి పద్మ, స్వరూప, పేర్ల అశోక్, యాదయ్య, స్వామి, లక్ష్మణ్, బొజ్జ వెంకన్న, జమాల్ ఖాద్రి, మెరుగు గోపి, సత్తయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీంద్రకుమార్

## దేశ చరిత్రలో నిలువనున్న వరంగల్ సభ

- అన్ని గ్రామాల నుంచి స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధమవుతున్న ప్రజలు
- బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 25 : వరంగల్‌లో కనివిని ఎరుగని రీతిలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న రజతోత్సవ సభ భారత దేశ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. పీఏపల్లి మండల కేంద్రంలో శుక్రవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సభ కాంగ్రెస్ విధానాల వ్యతిరేక సభగా మారిందని, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అర్హులందరికీ అందించకపోవడంతో రైతులు కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను సైతం కాంగ్రెస్ సర్కారు అందించడం లేదని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనను చూసి జనం తిరిగి కేసీఆర్ పాలన, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలు ఎండలు ఎక్కువగా ఉన్నందున జాగ్రతలు తీసుకోవాలని, మజ్జిగ, మంచి నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, జిల్లా నాయకులు రేటినేని ముత్యంరావు, నాయకులు ఆర్వపల్లి నర్సింహా, మహేందర్, రాయినబోయిన శ్రీనువాస్, ఎర్ర యాదగిరి, సుధాకర్‌గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



రామన్నపేట: కుంకుడుపాములకు చెందిన కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

- కేసీఆర్ సుభిక్ష పాలనను కోరుకుంటున్న జనం
- వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట/నార్కట్‌పల్లి ఏప్రిల్ 25 : సబ్బండ వర్గాల ప్రజలు సుభిక్షమైన కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కుంకుడుపాముల గ్రామానికి చెందిన 25 కాంగ్రెస్ కుటుంబాలు నార్కట్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రానున్నాయన్నారు. కేసీఆర్ సభ అంటేనే కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకు మొదలై అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలకు మోసపోయాయని రైతులు, మహిళలు, యువకులు బాధపడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మరోమారు కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని తెలంగాణ బిడ్డలు కంకణబద్ధులయ్యారని తెలిపారు. రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంతోషాచారి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పులిగిల్ల పరమేశ్, నాయకులు యానాల అశోక్ రెడ్డి, గొలుసుల సత్తి, బోగ భద్రయ్య, వలిగొండ పరుశరాములు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బొక్క శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కన్నెబోయిన సత్తయ్య, బెల్లి లింగయ్య, కన్నెబోయిన లింగయ్య, గుండెబోయిన నర్సింహ, కన్నెబోయిన సైదులు తదితరులు ఉన్నారు.

## నీటి నిల్వ సంరక్షణకు ప్రణాళికలు చేపట్టాలి

- కేఆర్ఎంబీ చైర్మన్ అకుల్ జైన్

నందికొండ, ఏప్రిల్ 25 : నాగార్జునసాగర్ డ్యామ్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించడానికి ప్రణాళికలను చేపట్టాలని ఎన్నెస్పీ అధికారులకు కేఆర్ఎంబీ చైర్మన్ అకుల్ జైన్ సూచించారు. నాగార్జునసాగర్ డ్యామ్, ఎడమ, కుడికాల్వల హెడ్ రెగ్యులేటర్లు, జలవిద్యుత్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున నీటి వినియోగంపై ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతామని, దానికి తగిన విధంగా డ్యామ్ నీటిని వినియోగిస్తామని తెలిపారు.



నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమకాల్వను పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ అకుల్ జైన్

నాగార్జునసాగర్ డ్యామ్‌పై భద్రత చేపడుతున్న సీఆర్‌పీఎఫ్, ఎస్పీఎఫ్ బలగాల విధులను అడిగి తెలుసుకున్నామన్నారు. రెండు రోజుల పర్యటనలో గురువారం ఆయన కుటుంబ సభ్యులతో బుద్ధవనం సందర్శించారు. ఆయనతో ఎన్నెస్పీ ఎస్ఈ మల్లికార్జున, ఏఈఈలు కృష్ణయ్య, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు గులాబీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ పోస్టర్‌ను బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే విధంగా సభ జరుగుతుందన్నారు. పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ జెండాలు ఎగురవేసి, బహిరంగ సభకు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని, బహిరంగ సభలో కేసీఆర్ ఏం చెప్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కల్లి బొల్లి మాటలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వచ్చిందన్నారు. కార్యక్రమంలో భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నలమాస రమేశ్ గౌడ్, నాయకులు చందుపట్ల రాజేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కుతాడి సురేశ్ పాల్గొన్నారు.



రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి